క్లుప్తంగా

ఘనంగా నర్సుల దినోత్సవం



సీనియర్ నర్సులను సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: లయన్స్ సిటీ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో నర్సుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి సీనియర్ నర్సులు డి.అన్నిగ్రేస్ కుమారి, కె.అనంతలక్ష్మిని సన్మానించారు. లయన్స్ సిటీ అధ్యక్షుడు ప్రభుదాస్ మాట్లాడుతూ, ఆరోగ్య వ్యవస్థలను మెరుగుపరచడం, ఉత్తమ ఫలితాల సాధనలో నర్సింగ్ వృత్తి కీలకమన్నారు. నర్సులు 24 గంటలూ రోగుల సేవలోనే ఉంటారని, వారి పాత్ర ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు అద్దాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, డాక్టరు శ్రీవల్లి, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న భారీ ర్యాలీ

బోట్‌క్లబ్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్థానిక టూటౌన్ నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని, ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పారన్నారు. దీంతో దిగివచ్చిన పాక్ శాంతి చర్చలకు వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు సీజీఆర్ఎఫ్ సమావేశం

కరప: విద్యుత్ పెండింగ్ సమస్యల పరిష్కారానికి స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సీజీఆర్ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్) ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీ, రీ కనెక్షన్ తదితర సమస్యలను వినియోగదారులు నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ ప్రత్యేక సమావేశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



యువ క్రికెటర్ జోసఫ్‌కు క్రికెట్ కిట్ అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎప్పుడూ ముందుంటామని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక టూటౌన్‌లోని మున్సబువీధిలో ఉన్న హరీష్ స్పోర్ట్స్‌లో మంగళవారం నిరుపేద క్రికెట్ క్రీడాకారుడు జోసఫ్‌కు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్ అందించారు. పేదరికం కారణంగా జోసఫ్ క్రికెట్ కిట్ కొనుగోలు చేసి ప్రాక్టీస్ చేయలేకపోతున్నాడని, మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారుడు కావడంతో అతడికి సాయం చేసినట్టు చెప్పారు.

చెవి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ చెవి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, ఇన్ఫెక్షన్ల కారణంగా వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని చెవి సమస్యలు వేధిస్తున్నాయని డాక్టర్ గుబ్బల లక్ష్మణప్రసాద్ అన్నారు. వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, చెవి మధ్యలో నీరు ఉండటం, చల్లగాలిలో పిల్లలను పడుకోబెట్టడం వల్ల టాన్సిల్స్, పంటినొప్పితో పిల్లలకు చెవి పోటు రావచ్చన్నారు. రాత్రి పూట నొప్పి ఎక్కువగా ఉంటుందని, చెవి సమస్యలు గుర్తిస్తే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, యనమల రామం, చింతపల్లి సుబ్బారావు, సూర్యనారాయణ, ప్రసాద్ నాయుడు, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో 14 మంది నిందితులను హాజరుపర్చారు. వీరిలో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 8 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జీబ్రా క్రాసింగ్ జాడేది..?

- ప్రమాదభరితంగా విద్యాసంస్థల ప్రధాన కూడళ్లు
- దాటేందుకు భయపడుతున్న పాదచారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



జేఎన్‌టీయూకే కూడలి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బోర్డులు

బాలాజీచెరువు: ఐదు లక్షలకు పైగా జనాభా. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం. ఇటువంటి ప్రధాన రహదార్లలో కనీసం జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్లు కూడా కనుమరుగవ్వడంతో ఆయా కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. స్మార్ట్ సిటీ నిధులతో రోడ్లను ఆధునీకరిస్తున్నా.. ప్రమాద హెచ్చరికలు సూచించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కత్తిపూడి నుంచి పామర్రు జాతీయ రహదారిలో నగర పరిధి ప్రారంభం కానున్న అచ్చంపేట జంక్షన్, ఏపీఎస్పీ, స్పెన్సర్స్, బోట్‌క్లబ్, నాగమల్లితోట జంక్షన్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, వినాయకుడి గుడి కూడలి, ప్రభుత్వ ఐటీఐ, జేఎన్‌టీయూకే, రంగరాయ వైద్య కళాశాలల వద్ద స్పీడ్‌బ్రేకర్లు కానీ, జీబ్రా క్రాసింగ్‌లు కానీ లేకపోవడంతో నిత్యం పాదచారులు లేక విద్యార్థులు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా రహదార్లలో ప్రయాణిస్తున్నా, కనీసం ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

ప్రమాద ఘంటికలు

సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి వరకూ పది వరకూ కూడళ్లు ఉండగా, కొన్ని ప్రాంతాల్లో అధికంగా విద్యాలయాలు, కూడళ్లు ఉన్నాయి. అక్కడ రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, కంగారుగా నడవాల్సి వస్తుంది. ఈ సమయంలో అతి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో విద్యార్థులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రంలోగా ఆయా కూడళ్లలో రెండు లేక మూడు వాహన ప్రమాదాలు చోటుచేసుకోవడం సర్వసాధారణంగా మారింది. గతంలో రహదారి విస్తరణతో పాటు, రోడ్డును ఆధునీకరించినప్పుడు జీబ్రా క్రాసింగ్‌తో ఉండటంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించేవి. ఆ సమయంలో విద్యార్థులు జీబ్రా క్రాసింగ్‌పై రోడ్డును క్షేమంగా దాటేవారు. అవి క్రమంగా కనుమరుగవ్వడంతో రోడ్డు దాటడానికి ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి ముఖ్యమైన కూడళ్లలో జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

జీబ్రా క్రాసింగ్ కనుమరుగు



విద్యాసంస్థల కూడళ్లలో జీబ్రా క్రాసింగ్‌లు పూర్తిగా కనుమరుగయ్యాయి. రోడ్డు దాటి అటు వైపు వెళ్లాలంటే.. ఏ సమయంలో వాహనం వచ్చి ఢీకొడుతుందోనన్న భయం నెలకొంది. వాహనాలు వేగంగా వచ్చి పాదచారులను ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి.

– కె.సాయిబాబు, గ్రంథాలయాధికారి, ఐడియల్ కళాశాల

కనీస ఆలోచన లేకుండా..



కనీసం కళాశాల కూడలి ఉందన్న కనీస ఆలోచన లేకుండా చాలా వేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి.

– వాకాద వెంకటరమణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అధ్యక్షుడు, యంగ్‌మైండ్ సంస్థ

పర్యావరణ పరిరక్షణతో వన్యప్రాణుల సంరక్షణ



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: వన్యప్రాణుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమని బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ అన్నారు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో మంగళవారం ప్రకృతిలో సామరస్యం–సుస్థిర అభివృద్ధి అనే అంశంపై చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ, ఆవరణ వ్యవస్థలో సమతుల్యం ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యమవుతుందని చెప్పారు. ఏదైనా ఓ జాతి(ప్రాణి) నశించిందంటే.. ఆ జాతిపై ఆధారపడే ఇతర ప్రాణులు నశించిపోయే ఆస్కారం ఉందన్నారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 94 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ తల్లి జాతర



జాతర చివరి రోజున గంగమ్మ తల్లికి నిర్వహిస్తున్న గ్రామోత్సవం



జాతరకు పోటెత్తిన భక్తులు

కరప: పెద్దాపురప్పాడు గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర మూడో రోజైన మంగళవారం గ్రామోత్సవంతో ముగిసింది. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర(గొల్లల సంబరం) మూడు రోజుల పాటు భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గోవ తాళ్లనే గ్రామ దేవత గంగమ్మ తల్లిగా ఆరాధించడం పెద్దాపురప్పాడు గ్రామస్తులకు ఆచారంగా వస్తోంది. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన యాదవులు తొలిరోజు బుట్టలో ఉన్న గోవతాళ్లను కిందకు దించి, ఆలయ ప్రాంగణంలో ఓచోట నిలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. గొల్లపల్లి వంశీకులు జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన యాదవులు తప్పెట గుళ్లతో నృత్యాలు చేస్తూ, భక్తిపాటలు ఆలపించారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, జాతరను తిలకించారు. చివరి రోజున వేలాది మంది భక్తులు తరలిరాగా, గంగమ్మ తల్లిని ఊరేగించారు. గ్రామోత్సవం అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా గొల్లపల్లి వంశీకులు గొల్లపల్లి ప్రసాదరావు, గొల్లపల్లి వీరవెంకట సత్యనారాయణ, గొల్లపల్లి అప్పన్నకాపు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గొల్లపల్లి రామకృష్ణ, గొల్లపల్లి సోమశంకరరావు, ఉంగరాల గంగాధర్‌తిలక్, కనకాల రామ్మోహనరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఒక్క మార్కు కూడా కీలకమే..

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

కాకినాడ సిటీ: డీఎస్సీ పరీక్షల్లో ఒక్క మార్కు కూడా కీలకమేనని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు మానసిక ధైర్యంతో సంసిద్ధులు కావాలని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు మంగళవారం సాయంత్రం సూర్యకళా మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు వీవీ రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, 2014, 2018 డీఎస్సీ ప్రశ్నపత్రాలను ఒకసారి ఆన్సర్ చేయాలని సూచించారు. డీఎస్సీ అభ్యర్థుల ప్రస్తుత గరిష్ఠ వయో పరిమితిని 44 నుంచి 47 ఏళ్లకు మార్చాలని కోరారు. డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో జరపాలన్నారు. ఇంకా అకడమిక్ అంశాలపై అవగాహన కల్పించారు. చదివినవి రివిజన్ చేసుకోవాలని, టెక్స్ట్ పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అత్యంత జాగ్రత్తగా ఆన్సర్ చేయాలన్నారు. కరెంట్ అఫైర్స్ గత 8 నెలల నుంచి జరిగినవి చదవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్పాట్ విశ్లేషణ చేసుకోవాలని, సబ్జెక్టులో బలహీనత గుర్తించుకుని, దాని నుంచి బయటపడే మార్గం అన్వేషించాలన్నారు. ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడికి గురి కాకుండా. గత డీఎస్సీ పేపర్లు స్టడీ చేయాలన్నారు. ప్రశ్న స్వభావం గుర్తించి ప్రిపరేషన్ కావాలన్నారు. జనరల్ నాలెడ్జ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కాన్సెప్ట్‌ను సృజనాత్మకతతో చదవాలని చెప్పారు. మెథడాలజీకి సంబంధించి తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాలు చదవడం ఉత్తమమని, గైడ్స్ కంటే టెక్స్‌బుక్స్ చదివితే ఉత్తమ ఫలితాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు రాసిన సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టీజీవీజీఆర్ రవిచక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి టి.ప్రభాకరవర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీవీ సాయిరామ్, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, ఇతర ప్రతినిధులు కేవీవీ నాగేశ్వరరావు, పీఎస్‌వీ గణేష్, సీహెచ్‌వీ రమణ, తోట సీతారామయ్య, టి.రామలక్ష్మి, డి.కనకదుర్గాదేవి, నక్కా గోవిందరాజులు, ఐ.ప్రసాదరావు, సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనాన్ని తాళలేక వృద్ధుడి బలవన్మరణం

కరప: జీవితంలో ఒంటరితనాన్ని తాళలేని ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కరపలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, కరప గ్రామానికి చెందిన ఇల్ల దుర్గారావు(60)ను కొన్నాళ్ల క్రితం భార్య వదిలివేసింది. దీంతో ఒక్కడే జీవనం సాగిస్తున్నాడు. గతేడాది కుమారుడు మరణించడంతో మరింతగా కుంగిపోయాడు. భార్య కాపురానికి రాకపోవడం, మరోవైపు ఆదుకోవాల్సిన కుమారుడి మరణంతో అతడికి జీవితంపై విరక్తి కలిగింది. ఈ క్రమంలో దుర్గారావు మంగళవారం తునిలో ఉంటున్న కుమార్తెకు చనిపోతున్నట్టు ఫోన్ చేశాడు. తర్వాత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీప్ ఫ్రీజర్ సేవలు ప్రారంభం



ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: సుషేణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న మదర్ మిల్క్ బ్యాంక్‌లో నూతనంగా డీప్ ఫ్రీజర్ ఏర్పాటు చేశారు. తల్లిపాల భద్రత కోసం వినియోగించనున్న ఈ డీప్ ఫ్రీజర్‌ను మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ సేవలు అసామాన్యవని కొనియాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన డీప్ ఫ్రీజర్ సామర్థ్యం 450 లీటర్లు కాగా, ఇందులో ఆరు నెలల వరకు తల్లి పాలను పాడవ్వకుండా భద్రపర్చవచ్చన్నారు. అలా భద్రపరిచిన పాలను పాశ్చరైజ్ చేసి శిశువుకి పట్టిస్తారని తెలిపారు. మిల్క్ బ్యాంకులోని పారిశుధ్య, రికార్డుల నిర్వహణపై డాక్టర్ విఠల్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, మిల్క్ బ్యాంకు మేనేజర్, బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వరప్రసాద్, సర్జికల్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాస్, పీడియాట్రిక్స్ వైద్యులు శ్రీవిద్య, విజయభాస్కర్, గోపీచంద్‌తో పాటు, మదర్ మిల్క్ బ్యాంక్ మేనేజర్ శివమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను కలిసిన మినిస్టీరియల్ బృందం



డాక్టర్ విష్ణువర్ధన్‌కు అభినందనలు తెలుపుతున్న జీజీహెచ్ మినిస్టీరియల్ బృందం

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌ను మంగళవారం కాకినాడ జీజీహెచ్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఎంసీలోని ఆయన కార్యాలయంలో ప్రిన్సిపాల్‌ను ఘనంగా సత్కరించారు. రంగరాయ వైద్య విద్యా ప్రమాణాలు మరింత వృద్ధి చేసి, కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సంబంధిత అంశాల్లో తమ వంతు సహకారం అన్ని విధాలా అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్‌ను కలిసిన వారిలో ఏడీ రమణమ్మ, ఏవో శర్మతో పాటు, సంఘ సహ అధ్యక్షుడు కొండేపూడి శేఖర్, కార్యదర్శి వై.సత్యనారాయణ, ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

వివాహేతర సంబంధం బట్టబయలు

పోలీసులకు పట్టిచ్చిన భర్త



మణికంఠను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం: ఓ ప్రియురాలు, ఆమె ప్రియుడి వివాహేతర సంబంధ వ్యవహారాన్ని ఆమె భర్తే బట్టబయలు చేశాడు. ఈ బాగోతం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. భార్య బాగోతాన్ని కళ్లారా చూసిన భర్త.. ఈ వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే, స్థానిక బాదంవారి వీధిలోని బాలా త్రిపుర సుందరి దేవాలయం సమీపంలో నివసిస్తున్న లక్ష్మణ్ రొయ్యల చెరువుల వ్యాపారం చేస్తుంటారు. రాత్రి వేళల్లో తరచూ ఇంటి నుంచి చెరువుల వద్దకు వెళుతుంటారు. ఈయన భార్య నాగవేణి కొన్నాళ్ల క్రితం ఓ లా కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేది. ఆ సమయంలో అక్కడే చదివిన విద్యార్థి బాలమణికంఠతో ఆమెకు పరిచయం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం ఈ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచీ వారి మధ్య సంబంధం కొనసాగుతూ వచ్చింది. లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంట్లో లేని సమయంలో మరో వ్యక్తి వచ్చి వెళుతున్నాడని పిల్లలు తండ్రికి చెప్పారు. దీంతో అప్పటికే స్నేహితుడిగా తరచూ ఇంటికి వచ్చి వెళుతున్న మణికంఠపై లక్ష్మణ్‌కు అనుమానం వచ్చింది. సోమవారం రాత్రి ఎప్పటిలాగే ఇంటి నుంచి రొయ్యల చెరువుకు వెళ్లిన లక్ష్మణ్‌కు అనుమానం వచ్చి అర్ధరాత్రి ఇంటికి తిరిగొచ్చాడు. దీంతో ప్రియుడితో ఉన్న భార్య వ్యవహారం బట్టబయలైంది. వెంటనే ఇంటికి తాళం వేసి లక్ష్మణ్ పోలీసులను ఆశ్రయించాడు. ఉదయం ఇంటికి వచ్చిన పోలీసులు తాళం తీసి మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. భర్త ఫిర్యాదుతో కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యాభర్తలపై దాడి

కరప: రోడ్డుపై ఎండబెట్టిన రొయ్యలను ఆటోతో తొక్కుకుని పోయారని అడిగినందుకు భార్యాభర్తలపై ఉప్పలంక గ్రామస్తులు దాడికి దిగారు. బాధితులు, పోలీసుల వివరాల మేరకు, మండలంలోని ఉప్పలంక గ్రామానికి చెందిన సంగాని ప్రసాద్ ఆ గ్రామ మార్కెట్ యార్డు రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద ఆదివారం చెరువులో పట్టిన రొయ్యలను ఎండబెట్టారు. అదే గ్రామానికి చెందిన గేదెల పెద సత్తిబాబు, పలువురు గ్రామస్తులు ఆటోతో ఆ రొయ్యలను తొక్కుకుంటూ వెళ్లిపోయారు. దీనిపై సంగాని ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు నిలదీయగా, వారు దుర్భాషలాడారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ప్రసాద్ ఇంటికి వచ్చి, అతడిపై, అతడి భార్య చిన్నతల్లిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరచారు. తీవ్ర గాయాల పాలైన ప్రసాద్‌ను చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితులు కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరుదు కల్యాణిని కలిసిన చంద్రకళాదీప్తి



వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని కలిసిన పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి. చిత్రంలో జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, జమ్మలమడక నాగమణి

ఘనంగా శ్రీపుష్ప యాగం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



కళాకారుల నృత్య ప్రదర్శన

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో రాజలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో భాగంగా దంపతులకు తాంబూలాలు అందజేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శనలో చిన్నారులు అలరించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

వేణుగోపాల స్వామి ఆలయంలో సదస్యం



సదస్యం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: నగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సదస్యం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు, ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు వివిధ రకాల పండ్లు, స్వీట్లు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

పిఠాపురం: పోక్సో చట్టంపై బాలికలు అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ ఎస్కే దుర్గాదేవి ఆధ్వర్యంలో మంగళవారం పిఠాపురం మండలం జల్లూరు, గోవింద రాజు పురం గ్రామాల్లో కిశోరీ వికాసం సమ్మర్ కాంపెయిన్ నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం బాలల హక్కులు, బాలల లైంగిక వేధింపుల నిషేధిత చట్టం (పోక్సో) గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి కిశోర వికాసాన్ని అమలు చేస్తున్నారని, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలాగే డెవలప్ చేయాలి అనే అంశాల పై అవగాహన కల్పించారు. అలాగే బాలల హక్కులు చట్టాలు వివరించారు. ఈ కార్యక్రమం మే 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జీఎంఎస్‌కే లావణ్య అంగన్‌వాడీ సిబ్బంది పలువురు బాలికలు పాల్గొన్నారు.